సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం | 5 | ఫిబ్రవరి | 2023

SPL SAKSHI PREMIER

ఫైనల్స్‌కు ఐడియల్‌-ఎ జట్టు


ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో రాణించాలని పాలిష్‌ స్పోర్ట్స్‌ అధినేత, 'సాక్షి' ప్రీమియర్‌ లీగ్‌ (ఎస్‌పీఎల్‌) క్రికెట్‌ పోటీల రిఫ్రెష్‌మెంట్స్‌ స్పాన్సర్‌ టి.పాలిష్‌ అన్నారు. - 8లో



14, 15 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: ఈ నెల 14, 15 తేదీలలో రాజమహేంద్రవరం- విశాఖపట్నం (07466/07467) మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు బ్యారేజి నుంచి శనివారం 6,410 క్యూసెక్కులు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1890, మధ్య డెల్టాకు 1230, పశ్చిమ డెల్టాకు 3290 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్‌

పారా లీగల్‌ వలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రజలకు, న్యాయ సేవాధికార సంస్థలకు పారా లీగల్‌ వలంటీర్లు వారధిలా పనిచేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్‌ కె.సునీత తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 14 మండలాల న్యాయ సేవాధికార కమిటీలతో పని చేసేందుకు పారా లీగల్‌ వలంటీర్ల నియామకానికి శనివారం స్థానికంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. 300 మంది హాజరయ్యారు. సంస్థ చైర్మన్‌ సునీత, ఏసీబీ కోర్టు న్యాయమూర్తి యాయూ ప్రసాద్‌, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి కె.ప్రత్యూష కుమారి అధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు జరిగాయి. ఆయా మండల న్యాయ సేవాధికార కమిటీల అధ్యక్షులు వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ 98.59 శాతం పూర్తి



కొంతమూరులో జాస్తిసూర్యకాంతంకు వృద్ధాప్య పింఛన్‌ అందజేస్తున్న వలంటీర్‌ జి.పావని

రాజమహేంద్రవరం రూరల్‌: జిల్లాలో నాలుగో రోజు కూడా లబ్ధిదారుల ఇళ్లకు వలంటీర్లు వెళ్లి పింఛన్‌ అందజేశారు. శనివారం నాటికి వైఎస్సార్‌ పెన్షన్‌ కానుక 98.59 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లావ్యాప్తంగా 2,36,877మంది లబ్ధిదారులు ఉండగా ప్రభుత్వం రూ.65.28కోట్లు కేటాయించింది. శనివారం సాయంత్రానికి 2,33,535 మంది లబ్ధిదారులకు రూ.64.35కోట్ల నగదు అందజేశారు. ఆదివారం సాయంత్రం వరకు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ,వైఎస్సార్‌క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్‌ సిరిపురపు సుభాషిణి తెలిపారు.

మట్టిపెళ్లలు మీద పడి ఒకరు దుర్మరణం

రూ.5లక్షలు పరిహారం చెల్లింపునకు కాంట్రాక్టరు అంగీకారం



మృతిచెందిన బూలా రాంబాబు


మధురపూడి/రాజానగరం: కోరుకొండ మండలం కోటికేశవరం శివారులో సాగునీటి కాలువ నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాతూ మట్టిపెళ్లలు విరిగి పడటంతో బూలా రాంబాబు(36) అనే కూలీ మృతి చెందాడు. శుక్రవారం ఉదయం 15 అడుగులు లోతున్న కాలువలోకి దిగి రాంబాబు మట్టిపని చేస్తుండగా పెద్ద ఎత్తున మట్టి బెడ్డలు విరిగి పడ్డాయి. తీవ్రంగా గాయపడిన అతడ్ని రాజమహేంద్రవరంలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య మరియ కుటుంబ పోషణ నిమిత్తం కువైట్‌ వెళ్లింది. తండ్రి విగత జీవి కావడం, తల్లి అందుబాటులో లేకపోవడంతో పిల్లలు దిక్కులేనివారయ్యారు. ఈ నేపథ్యంలో వీరికి న్యాయం చేయాలంటూ మృతుని బంధువులు రాజమహేంద్రరం ఆస్పత్రి వద్ద శనివారం మధ్యాహ్నం ఆందోళనకు దిగారు. కాంట్రాక్టరుతో పోలీసులు మాట్లాడి రూ.5 లక్షలు పరిహారం ఇచ్చేందుకు అంగీకరింపజేశారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది. ఈ ఆందోళన సందర్భంగా అరెస్టు చేసిన 11 మందిని వ్యక్తిగత పూచీకత్తు పై విడుదల చేశారు.

తమ్ముడికి షేక్‌ హ్యాండ్‌

- యనమల రామకృష్ణుడి కుమార్తెకు తుని బాధ్యతలు
- పరాభవంతో రగిలిపోతున్న యనమల కృష్ణుడు
- 40 ఏళ్ల కష్టానికి ఇదా ప్రతిఫలమంటూ ఆగ్రహం
- తాజా నియామకంతో టీడీపీలో రాజుకున్న చిచ్చు



తునిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణుడు



యనమల రామకృష్ణుడు



యనమల కృష్ణుడు



తుని టీడీపీ ఇన్‌చార్జి దివ్య

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఎన్నికలు దగ్గరపడే కొద్దీ తెలుగుదేశం పార్టీ మరింత అయోమయంలోకి వెళ్లిపోతోంది. ఉన్న సమస్యలే పరిష్కరించలేక అధిష్ఠానం చేతులెత్తేస్తుంటే కొత్త సమస్యలతో పార్టీకి తల బొప్పి కడుతోంది. తాజాగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు ఇన్‌చార్జి, కన్వీనర్‌, కో కన్వీనర్ల నియామకం, ఒక నియోజకవర్గానికి ఇన్‌చార్జిని కూడా నియమించుకోలేకపోవడం పార్టీలోని పరిస్థితులకు అద్దం పడుతోంది.

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గ ఇన్‌చార్జిగా యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్యను పార్టీ అధిష్ఠానం శుక్రవారం రాత్రి ప్రకటించింది. ఈ నియామకాన్ని ఆయన తమ్ముడు కృష్ణుడి వర్గం జీర్ణించుకోలేక పోతోంది. కుమార్తెను ఇన్‌చార్జిగా నియమించుకోవడానికి.. కార్యకర్తల అభిప్రాయ సేకరణ పేరుతో 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న రామకృష్ణుడు ఇటీవల అన్ని డ్రామాలు ఆడటం సమంజసమా అని సీనియర్లు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. తనతో పాటు సోదరుడు కృష్ణుడికి కూడా వయసు మీరిపోయిందని, యువకులకు ప్రాతినిధ్యం ఇవ్వాల్సిందిగా చంద్రబాబుకు తానే సూచించానంటూ గొప్పలకు పోయారని మండిపడుతోంది. చివరకు వ్యూహాత్మక ఎత్తుగడలతో కుమార్తెకు ఇన్‌చార్జి పదవి తన్నుకుపోయారని కారాలూ మిరియాలూ నూరుతోంది. సోదరులిద్దరి మధ్య చిచ్చు రేగినా బయటపడకుండా కథను రక్తి కట్టిస్తున్నారు.

సాయంత్రానికి సీను మారిందా..

దివ్య నియామకాన్ని శుక్రవారం రాత్రి అధిష్ఠానం ఖరారుచేస్తే తెల్లారేసరికి కృష్ణుడు కాకినాడ వచ్చి రామకృష్ణుడిని కలిసి అభినందనలు తెలియజేశారు. బయట మీడియా పలకరిస్తే అభినందించేందుకు వచ్చానని ముక్తసరిగా మూడు ముక్కలు మాట్లాడి వెళ్లిపోయారు. సాయంత్రం అయ్యేసరికి తునిలో ఆయన కార్యకర్తలతో అత్యవసరంగా భేటీ అయ్యారు. అభిప్రాయాలు తెలుసుకున్నాకనే రాజకీయ భవిష్యత్‌పై నిర్ణయం తీసుకుంటానని కృష్ణుడు ప్రకటించడంతో అన్నదమ్ముల మధ్య విభేదాలు తలెత్తినట్టేనని భావిస్తున్నారు. ఇటీవల కార్యకర్తలు, నేతలతో సమావేశాల్లో తనకు అవకాశం కల్పించాలని కోరినా అధిష్ఠానం పెడచెవిన పెట్టడాన్ని కృష్ణుడు తప్పు పడుతున్నట్లు సమాచారం. ఈ నెలలో జిల్లాకు వచ్చే చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడమా లేదా అనే నిర్ణయం కార్యకర్తల మనోభావాల మేరకు ఉంటుందని ఆయన చెబుతున్నారు. సమావేశంలో దివ్య పేరు ప్రస్తావించకుండా మరో వ్యక్తికి ఇన్‌చార్జి ఇచ్చారని కృష్ణుడు ప్రస్తావించినట్లు తెలిసింది.

ఇదా ప్రతిఫలం?

రామకృష్ణుడి కోసం నాలుగు దశాబ్దాలు చెమటోడ్చిన కృష్ణుడికే ఇలాంటి పరాభవం ఎదురైతే తమలాంటి వారి భవిష్యత్‌ ఏమిటని పార్టీ సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. తాజా నియామకం తర్వాత బయటకు చెప్పుకోలేని ఆవేదన, ఆగ్రహం కృష్ణుడి మాటల్లోనే వ్యక్తమైంది.ఎమ్మెల్యే, మంత్రి, స్పీకర్‌.. ఇలా అనేక ఉన్నత పదవులు రామకృష్ణుడికి వచ్చాయంటే నియోజకవర్గ పరంగా తాను ఇబ్బందులు లేకుండా చూడటం వల్లే కదా అయన ఆవేదన చెందుతున్నట్టు భోగట్టా. అయితే 40 ఏళ్ల పాటు నియోజకవర్గ బాధ్యతలు పూర్తిగా కృష్ణుడికే అప్పగించిన పాపానికి పార్టీ పతనమైందని.. అందువల్లే అధిష్ఠానం ప్రత్యామ్నాయ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని రామకృష్ణుడి వర్గం విశ్లేషిస్తోంది. చంద్రబాబును కృష్ణుడు కలిస్తే పోయేదేమీ లేదని ధీమాగా చెబుతోంది.

పొరుగు జిల్లాల్లో దీనావస్థ

మరోపక్క కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం నియోజకవర్గానికి పూర్తి స్థాయిలో ఇన్‌చార్జిని కూడా నియమించుకోలేని దీనావస్థలో టీడీపీ ఉంది. అక్కడి మాజీ ఎమ్మెల్యే పులపర్తి నారాయణమూర్తి మృతితో ఏర్పడిన ఖాళీని ఇప్పటి వరకూ భర్తీ చేయలేకపోయారు. లోక్‌సభ దివంగత స్పీకర్‌ జీఎంసీ బాలయోగి తనయుడు గంటి హరీష్‌ మాధుర్‌ను కన్వీనర్‌గా, జెడ్పీ మాజీ చైర్మన్‌ నామన రాంబాబును కో కన్వీనర్‌గా నియమించారు. అక్కడ భూతద్దం పెట్టి వెతికినా ఇన్‌చార్జిగా ఒక్క నాయకుడు కూడా దొరకకపోవడమే దీనికి కారణమంటున్నారు. ఖాళీగా ఉన్న మరో నియోజకవర్గం తూర్పు గోదావరి జిల్లా రాజానగరం. అక్కడి మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌ ఇన్‌చార్జిగా తప్పుకోవడంతో మరో నాయకుడి కోసం వెతుకులాడినా ఫలితం కనిపించలేదు. కాంగ్రెస్‌ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే, ఆయన తనయుడి కోసం చేసిన ప్రయత్నం విఫలమవడంతో నిర్ణయం వాయిదా వేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

బ్లేడ్‌బ్యాచ్‌ ఆగడాల కట్టడికి చర్యలు

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత



మాట్లాడుతున్న హోంమంత్రి తానేటి వనిత

మధురపూడి: రాష్ట్రంలో యువత చెడు ప్రభావాలకు గురి కాకుండా ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత తెలిపారు. శనివారం కోరుకొండ మండలం జంభూపట్నంలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరైన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రజల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే త్వరలో 6,400 మంది పోలీసులను రిక్రూట్‌ చేసుకోనున్నట్టు తెలిపారు. బ్లేడ్‌ బ్యాచ్‌, చైన్‌ స్నాచింగ్‌ల గురించి ప్రస్తావిస్తూ ఇలాంటి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు నైట్‌ పెట్రోలింగ్‌, బందోబస్తు మరింత పెంచుతున్నామన్నారు. అలాగే ప్రధాన కూడళ్లలో, శివారు ప్రాంతాల్లో సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తామన్నారు. దురలవాట్లకు లోనైన కొందరు ఈ తరహా ఆగడాలకు పాల్పడుతున్నారన్నారు. వారిని సరైన మార్గంలో పెట్టేందుకే శిక్షణా తరగుతులు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. యునైటెడ్‌ క్రిస్టియన్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు చిర్రా ప్రసాద్‌, సెక్రటరీ జోయల్‌రాజు, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర నాయకులు ముదునూరి నాగరాజు, కొవ్వూరి మున్సిపల్‌ చైర్మన్‌ భావన రత్నకుమారి, హోలీ ఏంజిల్స్‌ స్కూల్‌ అధినేత నెల్సన్‌ ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

మరింత రుచిగా గోరుముద్ద

- జగనన్న గోరుముద్ద పథకంలో సరికొత్త మెనూ
- జిల్లాలోని 982 పాఠశాలల్లో అమలు
- 1,25,761 మంది విద్యార్థులకు పౌష్టికాహారం



శాటిలైట్‌సిటీ జెడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్నభోజనం చేస్తున్న విద్యార్థినులు


రాజమహేంద్రవరం రూరల్‌: విద్యార్థులు బలంగా.. ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువుకుంటారనేది వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశం. అందుకే ఆయన సారథ్యంలోని ప్రభుత్వం 'జగనన్న గోరుముద్ద' పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. పోషక విలువలున్న ఆహారాన్ని అందజేస్తోంది. రోజుకో రుచికరమైన భోజనం పెట్టాలని ప్రభుత్వం గత నెల 12న ఆదేశాలిచ్చింది. సంక్రాంతి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో కుకింగ్‌ ఏజెన్సీలు కొత్త మెనూతో పసందైన వంటకాలు తయారుచేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, యాజమాన్య పరిధిలోని 982 పాఠశాలల్లో 1,25,761 మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా పోషకాహారం తీసుకుంటున్నారు.

మార్చి 2 నుంచి రాగిమాల్ట్‌

జగనన్న గోరుముద్దలో భాగంగా వారంలో మూడు రోజులు ఉదయం పూట రాగిమాల్ట్‌ ప్రభుత్వం అందించనుంది. మార్చి 2 నుంచి అందించేందుకు విద్యాశాఖ చర్యలు చేపడుతుంది. మరో మూడు రోజులు చిక్కీ అందించనుంది. రుచితోపాటు శుచి కూడా ఉండాలని 980 పాఠశాలల్లో 1105 మంది ఆయాలను నియమించింది. ఒక్కో ఆయాకు రూ.6 వేలు వేతనం చెల్లిస్తున్నారు. మూడు ఇంప్లిమెంట్‌ ఏజెన్సీలతో పాటు కుకింగ్‌ ఏజెన్సీల్లో 2124మంది వంట నిర్వాహకులు సరికొత్త మెనూ ప్రకారం పెడుతున్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.3వేలు ఇస్తున్నారు. టీడీపీ హయాంలో రూ.వెయ్యి మాత్రమే ఇచ్చేవారు.

కొత్తమెనూ ఇలా...

సోమవారం: హాట్‌పొంగల్‌, ఉడికించిన కోడిగుడ్డు లేదా పలావుతో ఎగ్‌కర్రి, వేరుశనగ చిక్కీ.
మంగళవారం: చింతపండు పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు.
బుధవారం: కూరగాయల అన్నం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన కోడిగుడ్డు, వేరుశనగ చిక్కీ.



అన్నం, ఆకుకూరపప్పు, ఉడికించిన కోడిగుడ్డు, వేరుశనగచిక్కి



విద్యార్థులకు వడ్డిస్తున్న ఉపాధ్యాయుడు

గురువారం: సాంబార్‌బాత్‌ లేదా టమాటా చెట్నీతో నిమ్మకాయపులిహోర (లెమన్‌రైస్‌), ఉడికించిన కోడిగుడ్డు.
శుక్రవారం: అన్నం,ఆకుకూరపప్పు, ఉడికించిన కోడిగుడ్డు,వేరుశనగచిక్కి
శనివారం: పప్పుచారు,ఆకుకూర అన్నం (పాలకూర, కొత్తమీర, కరివేపాకు, పొదినా వంటివి)

నిరంతర పర్యవేక్షణ



జగనన్న గోరుముద్ద అమలవుతున్న పాఠశాలల్లో మండల విద్యాశాఖాధికారులు,హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో పాటు డీఆర్‌డీఏ వైఎస్సార్‌క్రాంతి పథం ఏపీఎం, సచివాలయ వెల్ఫేర్‌ అసిస్టెంట్లు రోజూ పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే నేరుగా 14417 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్‌చేయవచ్చు.

- ఎస్‌.అబ్రహం ,జిల్లావిద్యాశాఖాధికారి

చాలా రుచిగా ఉంది



బడిలో స్నేహితులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశాను. చాలా బాగుంది. అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు,కర్రి, వెరుశెనగచిక్కి పెట్టారు. ఇలాంటి రకరకాల వంటలు పెట్టడంతో మాకు తినడానికి ఇష్టంగా ఉంటుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సొంత మేనమామ కంటే ఎక్కువగా మా బాగోగులు చూస్తున్నారు.

- ఎమ్‌.మోహనలక్ష్మీశ్రీ, విద్యార్థిని, ఆరవతరగతి, జెడ్పీహెచ్‌ఎస్‌, శాటిలైట్‌సిటీ, రాజమహేంద్రవరం

పర్యావరణ హితానికి మేము సైతం..

- ఎంపీ భరత్‌రామ్‌ అధ్వర్యంలో యువత- హరిత కార్యక్రమం
- రాజమహేంద్రవరంలో మొక్కలు నాటిన బిగ్‌బాస్‌ ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ హితం కోసం రాజమహేంద్రవరంలో మొక్కలు నాటామని, వాటి సంరక్షణ బాధ్యత తీసుకుంటామని బిగ్‌బాస్‌ ఫేమ్‌ అలేఖ్య, జస్వంత్‌ జెస్సీ, సిరి హన్మంత్‌, ఇనయ సుల్తానా, శ్రీహాన్‌ తెలిపారు. శనివారం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ సారథ్యంలో స్థానిక సిమెంట్రీ పేట ఆశోకా థియేటర్‌ వద్ద 'జగనన్న హరిత నగరాలు'లో భాగంగా యువత- హరిత కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన వారు మొక్కలు నాటారు. వాటికి వారి పేర్లతో బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్‌ మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి దానిని పరిరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. నగర ప్రధాన రహదారులలో నగరపాలక సంస్థ నిర్మించిన డివైడర్లపై చక్కని పుష్పాలు, ఫలాలు, అందాన్నిచ్చే మొక్కలను నాటుతున్నామని అన్నారు. ఈ మొక్కలను నగరంలోని అన్ని కళాశాలల విద్యార్థులకు దత్తత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి మొక్క వద్ద విద్యార్థుల పేర్లతో బోర్డులు ఉంటాయన్నారు. ఈ మొక్కలను నగరపాలక సంస్థతో పాటు విద్యార్థులు కంటికి రెప్పలా కాపాడాలని కోరారు. వీటిని మనం కాపాడితే మన భవిష్యత్తు తరాలను ఈ మొక్కలే వృక్షాలై కాపాడతాయన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్‌ కె.దినేష్‌కుమార్‌ మాట్లాడుతూ హరిత నగరంగా అభివృద్ధి చేసేందుకు ఎంపీ భరత్‌రామ్‌, తామూ కృషి చేస్తున్నామన్నారు. అన్ని ప్రధాన రహదారులకు డివైడర్లను రూ.4.50 కోట్లతో నిర్మిస్తున్నామని, ఇప్పటికే 90 శాతం పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో నగర వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, అడిషనల్‌ కమిషనర్‌ సత్యవేణి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ పాలిక శ్రీను, బీసీ సెల్‌ చైర్మన్‌ మజ్జి అప్పారావు, ఎస్సీ సెల్‌ చైర్మన్‌ కాటం రజనీకాంత్‌, మాజీ కార్పొరేటర్‌ డాక్టర్‌ అనసూరి పద్మలత, మానే దొరబాబు, నల్లా రామాంజనేయులు, ట్రేడ్‌ యూనియన్‌ అధ్యక్షుడు సప్పా ఆదినారాయణ పాల్గొన్నారు.



మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీ భరత్‌రామ్‌తో బిగ్‌బాస్‌ ఫేమ్‌ శ్రీహాన్‌, అలేఖ్య, సిరి, ఇనయ సుల్తానా, జస్వంత్‌ జెస్సీ

ఫైనల్స్‌కు ఐడియల్‌-ఎ జట్టు

- పోరాడి ఓడిన ఆదిత్య ఇంజినీరింగ్
- కాకినాడలో ముగిసిన పోటీలు


సెంచరీ సాధించిన ఐడియల్‌-ఎ జట్టు క్రీడాకారుడు సూర్యచైతన్య


ఫైనల్స్‌కు చేరిన ఐడియల్‌-ఎ జట్టుకు షీల్డ్‌ అందిస్తున్న హరీష్‌


కాకినాడ డివిజన్‌ రన్నర్స్‌ ఆదిత్య జట్టుకు షీల్డ్‌ అందిస్తున్న హరీష్‌

నాగమల్లితోట జంక్షన్‌ (కాకినాడ సిటీ): ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో రాణించాలని హరీష్‌ స్పోర్ట్స్‌ అధినేత, 'సాక్షి' ప్రీమియర్‌ లీగ్‌ (ఎస్‌పీఎల్‌) క్రికెట్‌ పోటీల రిఫ్రెష్‌మెంట్స్‌ స్పాన్సరర్‌ టి.హరిష్‌ అన్నారు. 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యాన స్థానిక రంగరాయ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో గత నెల 30 నుంచి జరుగుతున్న ఎస్‌పీఎల్‌ క్రికెట్‌ పోటీలు శనివారం ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న హరీష్‌ రాజమహేంద్రవరంలో జరిగే ఫైనల్స్‌కు ఎంపికైన జిల్లా జట్టుకు షీల్డు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించడానికి ఇటువంటి టోర్నమెంట్లు చక్కని అవకాశమని అన్నారు. పోరాడి ఓడిన వారు క్రీడాస్ఫూర్తితో వచ్చే ఏడాది విజయం సాధించడానికి ప్రయత్నించాలని అన్నారు. ఫైనల్స్‌కు చేరిన ఐడియల్‌-ఎ జట్టును హరీష్‌ అభినందించారు. కార్యక్రమానికి సాక్షి బ్యూరో ఇన్‌చార్జి ఎల్‌.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. శనివారం జరిగిన పోటీలను సాక్షి సీనియర్‌ యాడ్‌ మేనేజర్‌ వెంకటేశ్వరరావు, కోచ్‌ చార్లి పర్యవేక్షించారు. కాగా, ఇక్కడ విజేతగా నిలిచిన ఐడియల్‌-ఎ జట్టు కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలకు కలిపి రాజమహేంద్రవరంలో నిర్వహించే ఫైనల్స్‌లో పోటీ పడుతుందన్నారు. అక్కడ ఫైనల్స్‌లో గెలుపొందిన జట్టు విశాఖలో జరిగే పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

- క్వార్టర్‌ ఫైనల్స్‌లో ఆదిత్య ఇంజినీరింగ్‌-సి, ఐడియల్‌-ఎ జట్లు తలపడ్డాయి. టాస్‌ గెలిచిన ఐడియల్‌-ఎ జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి, నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. సూర్యచైతన్య 32 బంతుల్లో 100 పరుగులతో టోర్నమెంట్‌లో తొలి సెంచరీ నమోదు చేసి, నాటౌట్‌గా నిలిచాడు. మనోహర్‌ 38 పరుగులు చేశాడు. ఆదిత్య జట్టులోని బౌలర్లు మంగునాథ్‌ 2, వంశీ ఒకటి చొప్పున వికెట్లు తీసుకున్నారు. 172 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌ ప్రారంభించిన ఆదిత్య జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 67 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ జట్టులో సాయిరాం 23, శ్రావణ్‌ 13 పరుగులు చేశారు. ఐడియల్‌ జట్టులోని బౌలర్లు రాంకుమార్‌ 2, సాయిరాం ఒకటి చొప్పున వికెట్లు తీసుకున్నారు. 105 పరుగుల భారీ స్కోర్‌తో ఐడియల్‌-ఎ జట్టు విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది.
- తరువాత జరిగిన సెమీ ఫైనల్స్‌లో ఐడియల్‌-ఎ, ఆదిత్య ఇంజినీరింగ్‌-బి జట్లు పోటీ పడ్డాయి. టాస్‌ గెలిచిన ఐడియల్‌-ఎ జట్టు ఫీల్డింగ్‌ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్‌ చేసిన ఆదిత్య జట్టు నిర్ణీత ఓవర్లలో 96 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్‌ నంద 33, రెహమాన్‌ 28 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఐడియల్‌-ఎ జట్టు నిర్ణీత ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసి, 8 వికెట్ల తేడాతో విజయ బావుటా ఎగురవేసి ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ జట్టులోని బ్యాట్స్‌మెన్‌ మురళి 30, చైతన్య 20 పరుగులు చేసి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

రసవత్తరంగా..


విజేత జీబీఆర్‌ డిగ్రీ కాలేజీ జట్టు

రాజానగరం: ఇక్కడి గైట్‌ ఇంజినీరింగ్‌ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఎస్‌పీఎల్‌ క్రికెట్‌ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. పోటీలు సెమీఫైనల్స్‌కు చేరాయి. శనివారం మూడు మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా, అనివార్య కారణాలతో ఒక్క మ్యాచ్‌ మాత్రమే జరిగింది. ఇందులో జీబీఆర్‌ డిగ్రీ, మదర్స్‌ డిగ్రీ కళాశాలల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. టాస్‌ గెలిచిన జీబీఆర్‌ టీమ్‌ ఫీల్డింగ్‌ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌ చేసిన మదర్స్‌ టీమ్‌ నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 68 పరుగులు చేసింది. కుమార్‌ 13 బంతులకు 14 పరుగులు చేశాడు. జీబీఆర్‌ జట్టులోని శివ 4, నాని 2 వికెట్ల చొప్పున చెరో 2 ఓవర్లలో పడగొట్టారు. అనంతరం బరిలోకి దిగిన జీబీఆర్‌ టీమ్‌ 6 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసి, 8 వికెట్ల తేడాతో సునాయాసంగా విజయాన్ని సొంతం చేసుకుంది. శివ 14 బంతులకు 29, శివరామరెడ్డి 11 బంతులకు 22 పరుగులు తీసి జట్టు విజయానికి తోడ్పడ్డారు. ఈ పోటీలకు అంపైర్లుగా కె.దినేష్‌కుమార్‌, సూర్య, స్కోరర్‌గా రత్నకుమార్‌ వ్యవహరించారు.

వైభవంగా భీమేశ్వరుని రథోత్సవం

- తరలివచ్చిన అశేష భక్తజనం
- నూతన రథాన్ని ప్రారంభించిన స్వాత్మానందేంద్ర సరస్వతి, మంత్రి వేణు


నూతన రథాన్ని ప్రారంభించిన స్వాత్మానందేంద్ర, మంత్రి వేణు


రథంపై కొలువుతీరిన కల్యాణమూర్తులు

రామచంద్రపురం రూరల్‌: దక్షిణ కాశీ ద్రాక్షారామలో జరుగుతున్న మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన శనివారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అశేష భక్తజనం ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. కల్యాణోత్సవాల కోసం 45 రోజుల రికార్డు సమయంలో నిర్మించిన నూతన రథాన్ని విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రారంభించారు. పూలమాలికలతో అలంకరించిన నూతన రథంపై మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామితో పాటు, క్షేత్ర పాలకులు లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వర స్వామి వార్ల కల్యాణ మూర్తులను అధిష్ఠింపజేశారు. ధూపసేవ అనంతరం రథాంగబలి సమర్పించారు. ముహూర్త సమయానికి మంత్రి వేణు, వరలక్ష్మి దంపతులు, ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి (తారకేశ్వరరావు), సర్పంచ్‌ కొత్తపల్లి అరుణ రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయం నుంచి సూర్యా వీధి, వెలంపాలెం, చంద్రా వీధి, ప్రధాన రహదారి, యానాం సెంటర్‌ మీదుగా వేగాయమ్మపేటలోని ఆస్థాన పూజా మండపం వరకూ రథోత్సవం నిర్వహించారు. రథంలో ఆసీనులైన కల్యాణమూర్తులను దారి పొడవునా ప్రజలు కన్నులారా దర్శించుకున్నారు. కార్యక్రమంలో జాయింట్‌ కలెక్టర్‌ ధ్యానచంద్ర, ఎస్పీ సీహెచ్‌ సుధీర్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు సరాల ఏడుకొండలు, మంత్రి వేణు తనయులు నరేన్‌, ఉమాశంకర్‌ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆస్థాన పూజ

వేగాయమ్మపేటలోని ఆస్థాన మండపం వద్ద ఈఓ తారకేశ్వరరావు ఆధ్వర్యాన వాడ్రేవు జమీందార్ల వంశస్థుడు రాజా వాడ్రేవు సుందర రత్నాకరరావు చేతుల మీదుగా సాయంత్రం ఆస్థాన పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. రాత్రి రథం వద్ద సంగీత కచేరీ నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ వి.దుర్గారావు, ద్రాక్షారామ, రామచంద్రపురం ఎస్సైలు బి.వినోద్‌, డి.సురేష్‌బాబు ఆధ్వర్యాన పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈపీడీసీఎల్‌ ఏఈ యేసురత్నం ఆధ్వర్యాన విద్యుత్‌ సరఫరాను క్రమబద్ధీకరించి, వైర్లను తొలగించారు. రథోత్సవం ముగిశాక పునరుద్ధరించారు.

జయశ్రీ గ్రూప్స్‌ రాష్ట్ర కార్యాలయం ప్రారంభం


జయశ్రీ గ్రూప్స్‌ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి


జయశ్రీ గ్రూప్స్‌ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, జక్కంపూడి రాజా, రుడా చైర్‌పర్సన్‌ షర్మిలారెడ్డి

రావులపాలెం: కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో జయశ్రీ గ్రూప్స్‌ ముందుచూపు అభినందనీయమని విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. రావులపాలెం మండలం ఊబలంక రోడ్డులో ఏర్పాటు చేసిన జయశ్రీ గ్రూప్స్‌ రాష్ట్ర కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, అత్యాధునిక టెక్నాలజీతో విద్యుత్‌ వాహనాలను జయశ్రీ గ్రూప్స్‌ మార్కెట్లోకి తీసుకురావడం వలన సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. జయశ్రీ గ్రూప్స్‌ సభ్యులకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ చిర్ల జగ్గిరెడ్డి, రాజానగరం, పి.గన్నవరం, గోపాలపురం ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, కొండేటి చిట్టిబాబు, తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్‌ మేడపాటి షర్మిలారెడ్డి అభినందనలు తెలిపారు. ఈవీట్రిక్‌, ఐటీమీ, మెగాట్రాన్‌ కంపెనీలతో కలసి రాష్ట్రంలో 639 షోరూములు, 3,569 చార్జింగ్‌ స్టేషన్లు ప్రారంభిస్తున్నామని జయశ్రీ గ్రూప్స్‌ నిర్వాహకులు తెలిపారు. త్వరలో రాష్ట్రంలో ప్రతి 20 కిలోమీటర్లకు ఒక చార్జింగ్‌ స్టేషన్‌ ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ ఎండీలు మనోజ్‌పాటిల్‌, జి.శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌ స్కూల్‌ పరీక్షల షెడ్యూల్‌ విడుదల

రాయవరం: ఏపీ ఓపెన్‌ స్కూల్‌ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహించనున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్‌ పరీక్షల షెడ్యూల్‌ విడుదల చేశారు. ఈ విషయాన్ని ఓపెన్‌ స్కూల్‌ పరీక్షల కోనసీమ జిల్లా కో ఆర్డినేటర్‌ పి.సాయి వెంకట రమణ తెలిపారు. ఓపెన్‌ స్కూల్‌ పరీక్షలు ఏప్రిల్‌ 3 నుంచి 17వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 4,916 మంది విద్యార్థులు 10వ తరగతి, 12,862 మంది ఇంటర్‌ పరీక్షలకు ఇప్పటికే అడ్మిషన్లు పొందారు. పదో తరగతి పరీక్షకు ఒక్కో సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియెట్‌ థియరీ పరీక్షకు ఒక్కో సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్‌ పరీక్షకు రూ.100 చొప్పున చెల్లించాలని వెంకట రమణ వివరించారు. సప్లిమెంటరీ విద్యార్థులు ఇంటర్‌ థియరీ ఒక సబ్జెక్టుకు రూ.250, ప్రాక్టికల్స్‌కు రూ.100 వంతున చెల్లించాలన్నారు. ఇంప్రూవ్‌మెంట్‌ కోరుకునే విద్యార్థులు ఇంటర్మీడియెట్‌ థియరీ పరీక్షకు ఒక సబ్జెక్టుకు రూ.250, ప్రాక్టికల్స్‌కు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. గతంలో అన్ని సబ్జెక్టులూ ఉత్తీర్ణులై, ఇంప్రూవ్‌మెంట్‌ కోరుకునే విద్యార్థులు ఇంటర్‌ థియరీ ఒక్కో సబ్జెక్టుకు రూ.300, ఇంటర్‌ ప్రాక్టికల్‌ ఒక సబ్జెక్టుకు రూ.100 చెల్లించాలన్నారు. పరీక్ష ఫీజులను ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 15వ తేదీ వరకూ, రూ.25 అపరాధ రుసుంతో ఈ నెల 22 వరకూ, రూ.50 అపరాధ రుసుంతో మార్చి 2వ తేదీ వరకూ చెల్లించవచ్చని వివరించారు. తత్కాల్‌ విధానంలో మార్చి 3 నుంచి 7వ తేదీ వరకూ కూడా పరీక్ష ఫీజులు చెల్లించేందుకు అవకాశముంది. వివరాలకు సమీప స్టడీ సెంటర్ల కో ఆర్డినేటర్లను, ఓపెన్‌ స్కూల్‌ జిల్లా కార్యాలయంలోను సంప్రదించవచ్చని వెంకటరమణ తెలిపారు.

చైన్‌ స్నాచర్లకు దేహశుద్ధి

ఐ.పోలవరం: నడిచి వెళ్తున్న మహిళ మెడలో అరున్నర కాసుల బంగారు తాడు, సూత్రాలు, గొలుసును తెంచి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన చైన్‌ స్నాచర్లకు స్థానికులు దేహశుద్ధి చేశారు. ఐ.పోలవరంలో ఈ ఘటన జరిగింది. ఉలిసి వీర వెంకట సత్యవతి అనే మహిళ శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో పక్కింటికి వెళ్తోంది. అదే సమయంలో ముగ్గురు దుండగులు మోటార్‌ సైకిల్‌పై వచ్చి ఈ దారి ఎటువైపు వెళ్తుందని అడిగారు. అంతలోనే మరో వ్యక్తి సత్యవతి మెడలోని బంగారు ఆభరణాలు లాక్కున్నాడు. అనంతరం ముగ్గురూ బైక్‌పై ఉడాయించారు. సత్యవతి ఒక్కసారిగా కేకలు వేయడంతో చైన్‌ స్నాచర్లను స్థానికులు వెంబడించారు. ముగ్గురిలో ఇద్దరు పట్టుబడ్డారు. వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మరో వ్యక్తి బైక్‌పై పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

